
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 125 వ భాగం

## పురంజనోపాఖ్యానం 18

కాలుడి కూతురు దుర్భగ అనే ఆవిడ పురంజనుడి పురం మీద దాడి చేసింది బలాత్కారంగా అని చదివాం క్రితం నెల వ్యాసంలో. ఈ 'బలాత్కారం' అనే పదం ఎందుకంటే, మన ఇష్టాయిష్టాలతో పనిలేదు ఆవిడకి. ఈవిడకి ఇచ్చిన సలహా ప్రకారం భయుడు కనిపించకుండా వస్తాడు వెనక; వాడి సోదరుడు ప్రజ్వరుడు కనిపించి మరీ వస్తాడు లేదా వచ్చినప్పుడు కనిపించి తీరుతాడు. అయితే పురంజనుడు ఇదంతా చూస్తూనే ఉన్నాడు.

సీ. అనఘ! యెంతయు మమతాకుల చిత్తుఁడై
బహువిధ భూరితాపములఁ బొందె;
ఘనకుటుంబియుఁ గాలకన్యోపగూఢుండు
నష్టసంపదుఁడు వినష్టమతియు
విషయాత్మకుండును వినిహతైశ్వర్యుండు
గృపణుండు చాల నకించనుండు
నగు పురంజనుఁడు శోకావిలభావుఁడై
గంధర్వ యవన సంఘములచేత [4-818]

తే. నోజ చెడి వికలత నొందు నైజపురముఁ
దవిలి ప్రతికూలురును ననాదరణయుతులు
నయిన పుత్రులఁ బౌత్రుల ననుచరులను
సచివ పౌరోహితుల నిజసతినిఁ జూచి. [4-818.1]

మమతలూ అనురాగం (నేను, నావారు, బంధువులూ అనే) తో నిండి ఉండి అనేక కష్టాలు (భూరి తాపములు) అనుభవించాడు. అయినా పెద్ద కుటుంబం కనకా సంపదలన్నీ పోయినా సరే చేతకానివాడిలా చూస్తూనే ఉన్నాడు. ఇంత జరిగినా తన పురాన్ని వీడడానికి మాత్రం మనసు ఒప్పలేదు.

వ. మఱియుం గాలకన్యాగ్రస్తుం డయిన తన్నును నరిదూషితంబు లైన పాంచాల బలంబునుం జూచి యపారచింత నొంది తత్ప్రతీకారంబు చేయ నెఱుంగక కాలకన్యాపహృతవీర్యంబు లయినం గామంబుల నభిలషించుచు దీనుండును విగతాత్మ గతికుండును స్నేహంబునం జేసి పుత్రదారోపలాలన పరుండునునై కాలకన్యోపమర్దితంబును గంధర్వ యవనాక్రాంతంబును నైన పురంబు విడువ నిచ్చ లేకయు విడువ నుపక్రమించె; నప్పుడు. [4-819]

చివరకి భార్యా సతులనీ మిగతా పౌరోహితులనీ విడవలేక విడవలేక, చివరకి విడవడానికి నిశ్చయించుకున్నాడు. ఇదంతా ఎందుకంటే కోరికల వల్ల వచ్చిన దుఃఖం చేత వేదన కలిగింది కనకా ఈ దుర్భగ (కాలకన్య) అనేది వదలదు అని తెలిసింది కనకా, తన సైన్యం అయిన పాంచాలురు ఓడిపోవడం వల్లా.

క. అనఘా! భయనామాగ్రజుఁ
దనఁగల ప్రజ్వారుఁ డపుడ యరుదెంచి పురం
బును సకలంబును భయనా
మునికిం బ్రీతిగ దహించె మునుకొని యంతన్. [4-820]

ఈ సరికి ప్రజ్వరుడు – భయుడనేవాడి సోదరుడు – అన్న వచ్చి పురం ఆక్రమించాడు. అక్కడతో ఆగితేనా? పురం అంతా తగలబెట్టేసి తన తమ్ముడు భయుడికి ప్రీతి కలిగించాడు. ఈ పద్యంలో పోతన ప్రజ్వరుణ్ణి – భయుడికి అగ్రజుడు – అన్న అని సంబోధించాడు చూశారా? అంటే భయుడి కంటే ముందు వచ్చి పురం ఆక్రమించాడు కనక. దీనికి ముందే దుర్భగ వచ్చి పురాన్ని ఆక్రమించింది. అలా పురంజనుడి పురం మొత్తం సర్వనాశనం అయింది.

సీ. అయి చాల ఘురఘుర మను శబ్ద మదరంగ-
మనమునఁ జింతా నిమగ్నుఁ డగుచుఁ
గొడుకులఁ గోడండ్రఁ గూతుల నల్లుర-

మనుమల నాప్తుల ననుచరాళి
ననయంబు నల్పమాత్రావశిష్టం బైన-
గృహకోశనివహ పరిచ్ఛదముల
మసలు నహంకార మమకారములఁ జేసి-
మతిహీనుఁ డగుచు నెమ్మనములోనఁ [4-823]

తే గడఁకఁ దలఁచుచు విప్రయోగమునఁ దాను
గటకటా! యిట్లు పరలోక గతుఁడ నైన
యిట్టి భార్య యనాథయై యీ కుమార
వరుల నేరీతిఁ బ్రోచునో యరసి యనుచు. [4-823.1]

ఈ లోపుల గొంతులో గరగర మనే శబ్దం బయల్దేరింది. మనసంతా చింతతో నిండిపోయేసరికి బంధుకోటి అందర్నీ చూసి, అహంకారం మమకారం పోలేదు కనక ‘అయ్యో నేను పోయాక వీళ్ళు నా భార్యని అనాథ కాకుండా చూస్తారా, ఆవిడ ఎలా బతుకుతుందో?’ అనుకుంటూ ప్రాణం వదిలాడు.

క. చనుదెంచెను భయనాముం
డనువాఁ డప్పుడు పురంజనాఖ్యుఁడు పెలుచన్
వినుతాత్మ! పశువు భంగిని
మనము గలఁగ యవన నీయమానుం డయ్యెన్. [4-828]

పురంజనుడి ప్రాణం పోయాక చూడ వచ్చిన భయుదు ఈ పురంజనుణ్ణి పశువుని కట్టి లాక్కుపోయినట్టూ లాగి తన కూడా తీసుకెళ్ళాడు.

వ. అనుచర వర్గంబు భృశాతురులును దుఃఖితులునై వెనుచనుచుండ నుపరుద్ధంబగు భుజంగమం బప్పురంబు నెప్పుడు వాసె నప్పు డా పురంబు పురంజను బాసి విశీర్ణంబై ప్రకృతిం బొందె; బలవంతుండయిన యవనునిచేత బలాత్కారంబున వికృష్యమాణుండైన పురంజనుండు దమఃపిహితుం డై పూర్వ సుహృత్తగు సఖు నీశ్వరు నెఱుంగకుండె; నంతం

బరలోకగతుండైన పురంజనుం గదిసి పూర్వంబున నదయుం డైన యతనిచేత హింసింప బడిన యజ్ఞపశువులు క్రోధోద్రేకంబునఁ గుఠారంబులనతని నఱికె; నివ్విధంబునఁ బ్రమదాసంగదోష దూషితుండును, నపార తమోనిమగ్నుండును, నష్టజ్ఞానుండును నయి పురంజనుం డనేక కాలంబు పరలోకంబున నార్తి ననుభవించి తద్భార్యయైన ప్రమదోత్తమం జిత్తంబున నశ్రాంతంబును దలంచుచుండం దదీయ సంస్మరణంబునం జేసి తరవాతి జన్మంబున విదర్భరాజ గృహంబునం బ్రమదోత్తమ యై జన్మించె; నంత. [4-829]

మొదట్లో చెప్పుకున్నాం కదా ఒక పాము (భుజంగం) పురాన్ని రక్షించేదని? ఆ భుజంగం పురాన్ని వదిలిపోయింది. ఎక్కడికి? పంచభూతాల్లో కలిసిపోయింది (విశీర్ణంబై ప్రకృతిం బొందె). అయితే పురాన్ని వదిలేసిన పురంజనుడేమయ్యాడు? అహంకారం మమకారం కోరికలూ అవీ కట్టేసుకున్న ఈ రాజుగారికి – అందరికీ అసలు సిసలు స్నేహితుడైన భగవంతుడంటే – ఏమీ తెలియదు. భయుడితో పాటు పరలోకం చేరేసరికి యజ్ఞయగాదుల్లో తాను చంపిన పశువులూ, తాను హింసించిన ప్రాణులూ కోపంతో మీద పడి చంపి కసి తీర్చుకున్నాయి. అయితే పోయేటపుడు భార్య మీద బెంగతో అస్తమానూ ఆవిడనే తలుచుకుంటూ ఉండడం వల్ల తర్వాతి జన్మలో విదర్భరాజు కూతురిగా పుట్టాడు.

ఎన్నాళ్ళు జీవితం సాగినా, కోరికలు తెంచుకోకపోతే ఏది నిరంతరం స్మరిస్తున్నామో అనే కదులుతుంది మనసులో చనిపోయేటపుడు. హిందూ మతం ప్రకారం ఇలా దేహం విడిచిన ఆత్మ, మనసు, ఈ జీవితం, కిందటి జీవితాలలో ప్రోగుపెట్టుకున్న వాసనలూ అన్నీ ఆవరించగా మరో దేహంలోకి ప్రవేశిస్తుంది. ఇలా వాసనలు ప్రోగయ్యేకొద్దీ జన్మలు ఒకదాని వెంట ఒకటి వస్తూనే ఉంటాయి. ఈ జన్మ మృత్యు పరంపర అలా సాగుతున్నప్పుడు ఏ జన్మలోనో 'అబ్బే సంతోషానికి దారి ఇది కాదు, ఈ అహంకార మమకారాలు వదుల్చుకుని భగవంతుణ్ణి ధ్యానించాలి అయనే నాకు అసలు సిసలు స్నేహితుడు' అనేది ఎరుకలోకి వస్తుంది. అలా జ్ఞానం కోసం మొదటి అడుగు పడ్డాక గురువుల శిక్షణలో మరికాస్త ముందుకి వెళతాం. అయితే ఒక జన్మలో చేసిన పాపం, మూటగట్టుకున్న అహంకారం మమకారం వెంట వచ్చినట్టే ఈ పుణ్యం కూడా వస్తుంది. దీనివల్ల పై జన్మలో మరికాస్త ఎక్కువ పుణ్యం, తర్వాత మరో కొంచెం పుణ్యం ఇలా భగవంతుడి దారిలో పడి ఏనాటికో ఈశ్వరుణ్ణి చేరుకుంటాం. దీన్నే భగవద్గీతలో కృష్ణుడు చెప్తాడు – 'శుచీనాం శ్రీమతాంగేహే యోగ భ్రష్టోభిజాయతే' (గీత, ధ్యాన యోగం-41) అని. యోగమార్గంలో భ్రష్టుడైనవాడు మంచి కులంలో శ్రీమంతుడిగా పుట్టి మరోసారి సాధన మొదలుపెడతాడు అని. ఎన్ని పశువులని హింసించాడో అవన్నీ పురంజనుడు మీద కసి తీర్చుకున్నాక తాను చేసిన యజ్ఞయాగాదులవల్ల వచ్చిన పుణ్యంతో శ్రీమతుల ఇంట్లో అంటే విదర్భ రాజు ఇంట్లో పుట్టాడు. కూతురిగా ఎందుకనేది భగవద్గీతలో చూద్దాం.

అంతకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా కలేవరమ్ ।
యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః ॥ (అక్షర పరబ్రహ్మ యోగం 8-5)

మరణ సమయంలో నన్ను స్మరిస్తూ దేహాన్ని విడిచిపెట్టిన వాడు నన్నే చేరుకుంటాడు. ఈ విషయంలో ఎలాంటి సందేహానికి తావు లేదు. అయితే భగవంతుణ్ణి స్మరించకపోతే ఏమౌతుంది? అది తర్వాత శ్లోకంలో చెప్తున్నాడు.

యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కలేవరమ్ ।
తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః ॥ (8-6)

శరీరాన్ని విడిచిపెట్టే సమయంలో దేనినైతే గుర్తుచేసుకుంటాడో (యం వాపి స్మరన్ భావం), ఎప్పుడూ అదే ధ్యాసలో ఉండటం వలన ఆ వ్యక్తి అదే స్థితిని పొందుతాడు. పురంజనుడు తనవాళ్ళు భార్యని సరిగ్గా చూస్తారా ఆవిడకి ఏమౌతుంది, ఆవిడ వల్ల పొందిన సంసార సుఖం అవీ మనసులో తల్చుకుంటూ పోయాడు. అందువల్లే ఇప్పుడు ఆడపిల్లగా విదర్భరారాజు ఇంట్లో – శ్రీమంతుడి కూతురిగా పుట్టాడు. ఇక్కడనుంచి ఆవిడ సంగతి అనేక జన్మలు ఎత్తడం అవీ కథలోకి రావు గానీ ఆవిడకి ఏమైంది, అసలు పురం అంటే ఏమిటి, పురంజనుడేమయ్యాడనేది ముందు వస్తుంది. ఇలా విదర్భ రాజు కూతురు లేదా, విదర్భి పెద్దయ్యాక మలయధ్వజుడు అనే ఆయనని వరించింది. వారి సంతతి వృద్ధి అవుతూంటే మలయధ్వజుడికి భగవంతుడి ప్రేరణ వల్ల తపస్సుచేయాలనే కోరిక కలిగింది.

తే. క్ష్మాతలంబెల్ల నిజతనూజాతులకును
బంచి యిచ్చి సరోజాక్ష పాదపంక
జార్చనాయత్తుఁ డగుచుఁ గులాద్రి కరుగ
నంత మదిరాక్షి సతి యగు నా విదర్భి [4-832]

భూమండలం (తన రాజ్యం) – క్ష్మాతలము, అంతా తన వారికి పంచిపెట్టాడు. భగవంతుడి పాదాలని ఆశ్రయించడానికి (సరోజాక్ష; సరోజము – పద్మము, వంటి కళ్ళు కలవాడు – మహా విష్ణువు) బయల్దేరాడు. ఈయన్ని చూసి విదర్భి కూడా అనుసరించింది.

వ. అట్లు ధర్మపత్ని వెంటరాఁ జని ... ... .... కాయకర్శనంబైన తపం బాచరించుచు శీతోష్ణ వర్ష వాతంబులు క్షుత్పిపాసలుఁ బ్రియాప్రియంబులు సుఖదుఃఖంబులు నను ద్వంద్వంబుల సమదర్శనుండై జయించి తపోవిద్యాయమ నియమంబులం జేసి పక్వకషాయుండై బ్రహ్మంబునందు నిజాత్మ ననుసంధించి విజితేంద్రియ ప్రాణ చిత్తుండై స్థాణువుం బోలె దివ్యవర్ష శతంబు దపంబు చేసి భగవంతుం డయిన వాసుదేవుని యందుఁ బ్రీతి వహించుచు నన్యం బెఱుంగక వర్తించుచుఁ దన్ను స్వప్నమందు 'మమేదం శిరశ్ఛిన్నమితి' యను ప్రతీతియందుం బోలె వ్యతిరిక్తునిఁగా వ్యాపకునిఁగా నంతఃకరణవృత్తిసాక్షినింగా నెఱింగి. [4-834]

ఈయన తపస్సు ఎలా చేసాడో చెప్తున్నాడు గమనించండి., శీతోష్ణ సుఖ దుఃఖాలు, ఆకలీ దాహం, ప్రియం అప్రియం అనే ద్వందాలని సమంగా చూస్తూ ఆత్మని బ్రహ్మంలో దర్శించాడు. ఇలా వంద దివ్య వర్షాలు తపస్సు చేశాడు. శరీరాన్నితనకి భిన్నంగా భావించాడు (మమేదం శిరశ్ఛిన్నమితి' – తన శిరస్సు తెగగొట్టబడింది); కలలో జరిగినవి తాను కాదు అన్నట్టుగానే. అలా తపస్సు వల్ల సిద్ధి పొంది భగవంతుణ్ణి చేరుకున్నాడు.

పోతన భాగవతంలో మనకి విశదమయ్యేది ఇదే – మన నిజ జీవితంలో కనిపించేది ఏదీ మనకు నిజంగా సంతోషం కలిగించేది కాదు. మనకెవరూ నిజమైన స్నేహితులూ శత్రువులూ లేరు. కూడా వచ్చేది మనం చేసుకున్న పాప పుణ్యాలు మాత్రమే. అందుకే నిరంతరం భగవంతుణ్ణి తల్చుకోవడం ముఖ్యం అనేది భాగవతం సారాంశం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS